ప్రజాశక్తి
శుక్రవారం 24 మార్చి 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కూలిన బతుకులు

- రామజోగిపేటలో పురాతన భవనం కూలి ముగ్గురు మృత్యువాత
- ఐదుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం
- మృతులకు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

మృతిచెందిన అంజలి

దుర్గా ప్రసాద్ మృతదేహం

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గంగారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వారంతా చిన్నచిన్న ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వేర్వేరు ప్రాంతాల నుంచి పొట్టచేతబట్టుకుని నగరానికి వచ్చినవారు. పిల్లా పాపలతో ఉన్నంతలో సంతోషంగా జీవిస్తున్న వారిని ఓ పురాతన భవనం విషాదంలోకి నెట్టింది. విశాఖ నగరంలోని కలెక్టరేట్ సమీపంలోగల రామజోగిపేటలో పురాతన మూడు అంతస్తుల భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో ముగ్గురు మరణించారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ఘటనతో విశాఖలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎక్కడ చూసినా 'అయ్యో.. ఎంత ఘోరం' అన్నవారే కనిపించారు.

స్థానికుల కథనం ప్రకారం రామజోగిపేటలో బుధవారం అర్ధరాత్రి దాటాక మూడు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఇది సుమారు 40 ఏళ్ల క్రితం నాటిది. పిల్లర్లు లేవు. పునాది తక్కువగా ఉంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నానిపోయి కూలిపోయింది. ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో విజయవాడకు చెందిన కొమ్మిశెట్టి శివశంకర్, బీహార్‌కు చెందిన రమల్లా సాహు (చోటూ) నివసిస్తున్నారు. వీరిద్దరూ ఇటీవలే ఈ ఇంటిలో అద్దెకు దిగారు. నూడిల్స్ దుకాణంలో పనిచేసుకొని జీవనం సాగిస్తున్నారు. మొదటి అంతస్తులో సాకేటి రామారావు, అతని భార్య కల్యాణి, కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె అంజలి ఉంటున్నారు. రామారావు ప్రైవేట్ ఉద్యోగి. కళ్యాణి సమీపంలోని ఆయుష్మాన్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్. కుమారుడు దుర్గాప్రసాద్ ఆచారి కాలేజీలో ఇంటర్, కుమార్తె అంజలి రామకృష్ణ మిషనరీ స్కూలులో పదో తరగతి చదువుతున్నారు. మరో అంతస్తులో సన్నపు కృష్ణ, అతని భార్య రోజా రాణి ఉంటున్నారు. వారిది గుమ్మలక్ష్మీపురంలోని దుమ్మరి గ్రామం. అరవింద్ క్యాటరర్స్‌లో మిగతా 2లో..

గురువులు ఆశలు.. ఆవిరి

ఎమ్మెల్సీగా ఓటమి - దెబ్బకొట్టిన క్రాస్ ఓటింగ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి నేత కోలా గురువులకు మళ్లీ నిరాశే ఎదురైంది. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ అధ్యక్షునిగా ఉన్న ఆయన్ని ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసిపి అధిష్టానం ప్రకటించిన సందర్భంలో గెలుపు తథ్యమని అందరూ భావించారు. అయితే అందుకు విరుద్ధంగా ఫలితం రావడంతో ఆయన ఓటమి చెందారు. శాసనసభలో ఉన్న బలాబలాలను బట్టి ఎన్నికలు జరిగిన మొత్తం 7 స్థానాల్లో వైసిపి అభ్యర్థులు విజయం సాధించాల్సి ఉంది. అయితే గురువారం వైసిపిలో క్రాస్ ఓటింగ్ జరగడంతో ఆ పార్టీ తరఫున పోటీలో ఉన్న ఏడుగురులో ఆరుగురు విజయం సాధించగా కోలా గురువులు ఓటమి చెందారు. దీంతో దక్షిణ నియోజకవర్గంలో ఆయన అనుచరులు, ముఖ్యంగా మత్స్యకారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అందినట్టే అంది ఎమ్మెల్సీ పదవి చేజారడం పట్ల వారు తీవ్రంగా బాధపడ్డారు. వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉంటూ, విధేయునిగా గురువులు గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.

కోక్ బకెట్ పగిలి

'ఉక్కు'లో ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కోకో ఒవెన్-5లో గురువారం ప్రమాదం సంభవించింది. కోక్‌ను తీసుకెళ్లే బకెట్ పగిలిపోవడంతో సుమారు రెండు కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. సాధారణంగా కొన్ని సంవత్సరాల తర్వాత వేడి కోక్‌ను తీసుకెళ్లే బకెట్లు పాతబడి పగిలిపోతూ ఉంటాయని అధికారులు వెల్లడించారు. బకెట్ తెగిపోవడంతో కోక్ మొత్తం నేలపాలైందన్నారు. విభాగంలో మంటలు రేగిన వెంటనే సిబ్బంది అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

వర్షంతో పంటలకు తీవ్ర నష్టం

వార్త 5లో..

తారల క్రికెట్ పోటీలకు సర్వం సిద్ధం

వార్త 8లో..

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వార్త 3లో..

అనకాపల్లిలో భగత్‌సింగ్‌కు నివాళ్లర్పిస్తున్న కె.లోకనాథం తదితరులు

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటం

వర్ధంతి సభల్లో వక్తలు వార్త 4లో..

ఒపిఎస్ ఉద్యోగులకు బెదిరింపులు తగవు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమ్మెలు, ధర్నాల్లో పాల్గొంటే ఉక్కుపాదం మోపుతామని కేంద్ర ప్రభుత్వం ఒపిఎస్ ఉద్యోగులకు హెచ్చరికలు చేయడం మానుకోవాలని, ఇటువంటి ప్రకటనలకు ఉద్యోగులు ఎవరూ జడవరని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్‌పిఎస్, సిపిఎస్ రద్దు చేయాలని పెద్దఎత్తున నిరసనలు చేపడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. వివిధ ఎన్నికల్లో వీటిని రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని చెప్పి పాలకులు ఉద్యోగులను మోసం చేశారన్నారు. ఉక్కుపాదం మోపిన అనేక ప్రభుత్వాలు తమ అధికారాన్ని కోల్పోయాయని గుర్తుచేశారు. ఉద్యోగులకు అండగా సిఐటియు నిలబడుతుందని, వారంతా ఐక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు.

జివిఎంసి స్థాయీ సంఘం సమావేశంలో

32 అంశాలు ఆమోదం

సమావేశంలో హరివెంకట కుమారి, స్థాయీ సంఘం సభ్యులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘ సమావేశం గురువారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. అజెండాలో 34 అంశాలను పొందుపరచగా అందులో 32 అంశాలు ఆమోదం పొందాయి. మిగిలిన 2 అంశాలను వాయిదా వేశారు. 1 నుండి 5 వరకు ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌కు సంబంధించినవి ఆమోదించామని, 6, 30వ అంశాలను వాయిదా వేశామని ఛైర్‌పర్సన్ తెలిపారు. 7 నుంచి 25 వరకు రెవెన్యూ విభాగానికి చెందిన వాణిజ్య సముదాయాల లీజుకు సంబంధించిన అంశాలను ఆమోదించామన్నారు. 27 నుంచి 29 వరకు ఇంజినీరింగ్‌కు సంబంధించినవి ఉన్నాయన్నారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అదనపు నిర్మాణాలకు రూ.133.08 లక్షలతో అంచనాలు రూపొందించగా వాటిని ఆమోదించామన్నారు.

మొదటి పేజీ తరువాయి..

కెజిహెచ్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న జివిఎంసి కమిషనర్ రాజాబాబు

కూలిన బతుకులు

కృష్ణ డ్రైవర్‌గా పని చేస్తుండగా, భార్య రోజారాణి ఆయుష్మాన్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు.

ఒకే కుటుంబంలో విషాదం

భవనం కుప్పకూలిన సంఘటనలో గ్రౌండ్ ఫ్లోర్‌లో నివసిస్తున్న రమల్లా సాహు (చోటూ) (28), మొదటి అంతస్తులో నివసిస్తున్న దుర్గాప్రసాద్ (17) అతని సోదరి అంజలి (15) అక్కడికక్కడే మరణించారు. దుర్గాప్రసాద్, అంజలి చనిపోవడంతో పాటు వారి తల్లిదండ్రులూ తీవ్రంగా గాయపడటంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ కుటుంబంలోని కల్యాణి పరిస్థితి విషమంగా ఉంది. ఆమె భర్త రామారావుకూ తీవ్ర గాయాలయ్యాయి.

ఒక్కసారిగా భారీ శబ్దం

భవనం కూలిన సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల నివసిస్తున్న వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కంగారుగా ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున దుమ్ము రేగింది. భవనం కూలిన విషయాన్ని కొద్ది క్షణాల్లోనే గుర్తించారు. సమాచారం అందడంతో పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, ఫైర్, రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న వారిని రక్షించి హుటాహుటిన కెజిహెచ్‌కు తరలించారు.

మృతులకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలి : సిపిఎం

సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావుతో కూడిన బృందం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగారావు మీడియాతో మాట్లాడుతూ భవనం కుప్పకూలిన సంఘటనకు జివిఎంసి అధికారుల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. మరణించిన వారికి ఒక్కొక్కరికీ రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందివ్వాలన్నారు. జివిఎంసి పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందన్నారు. పేదలను హింసిస్తూ అక్రమాధిపతులను రాజకీయ అండతో ప్లానింగ్ డిపార్టుమెంట్ వెనకేసుకు వస్తుందని విమర్శించారు. మురికివాడలు, కొండవాలు ప్రాంతాలలో నివాసులకు భద్రత కల్పించడం లేదన్నారు. జివిఎంసి నిధులను బ్యూటిఫికేషన్, రంగులు, బొమ్మలు, కలర్ లైట్ల కోసం దుర్వినియోగం చేస్తున్నారన్నారు. పెట్టుబడుల సమ్మిట్, జి - 20 దేశాల సదస్సుల పేరిట అభివృద్ధిని విస్మరిస్తున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయకపోవడం శోచనీయమన్నారు. కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించడానికి అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా సంఘటనా స్థలానికి రాలేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, కె.నర్సింగరావు, రమణ పాల్గొన్నారు.

మేయర్, కమిషనర్ సందర్శన

ఎంవిపి.కాలనీ : సంఘటనా స్థలాన్ని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ రాజాబాబు సందర్శించారు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఇది ఎంతో బాధాకరమైన విషయమని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కుటుంబాలను జివిఎంసి తరపున ఆదుకుంటామని తెలిపారు. ఎస్.అంజలి, దుర్గాప్రసాద్‌ల మృతదేహాల వద్ద బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అంజలి ఘటించారు.

పర్యావరణంపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'ధరిత్రి గంటను పాటిద్దాం.. మన పర్యావరణాన్ని మనమే కాపాడుకుందాం' అని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా ప్రతినిధి హాని సెలెస్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం శివాజీ పాలెం జివిఎంసి పాఠశాల, ఎంవిపి కాలనీలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్, ఎంవిపిలోని సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఫర్ ఉమెన్, విశాఖ విమెన్స్ కాలేజీల్లో పర్యావరణ ఆవశ్యకతను తెలియజేస్తూ డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా, గ్రీన్ క్లైమేట్ టీంలు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాయి. జెవి.రత్నం, మాణిక్య కుమారి, విజయ్ కుమార్, పుష్పలత, ఉమా గాంధీ, స్వప్న పాల్గొన్నారు.

పోస్టర్లను ప్రదర్శిస్తున్న చిన్నారులు

రియల్ సి 55 ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆధునిక ఫీచర్లు, సొగసైన డిజైన్, శక్తివంతమైన పనితీరుతో రియల్ మీ సి 55 వినియోగదారులను ఆకర్షించేలా రూపొందించబడిందని రియల్ మీ ఇండియా బిజినెస్ గ్రూప్ ప్రతినిధి మాధవ్ షేత్ తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కెమెరా, స్టోరేజ్, ఛార్జింగ్, డిజైన్‌లలో ఇది అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. 8 జిబి ర్యామ్, 16 జిబి డైనమిక్ ర్యామ్‌తో అందుబాటులోకి తెచ్చామన్నారు.

కళా సేవకులకు పురస్కారాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కళా రంగంలో అంకిత భావంతో సేవలందిస్తే తగిన గుర్తింపు ఉంటుందని సెంచూరియన్ విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య జిఎస్ఎన్.రాజు అన్నారు. సాయిప్రియ రాగ ప్రభ సంగీత సంస్థ పదో వార్షికోత్సవం సందర్భంగా పిఠాపురం కాలనీలోని కళా భారతి ఆడిటోరియంలో పాడనా తెలుగు పాట శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ సాంస్కృతిక రంగంలో ఎనలేని సేవలు అందిస్తున్న కళాకారులను సత్కరించడం అభినందనీయమన్నారు.

అనంతరం కళారంగ నిర్వాహకులు ఎంవి.రాజశేఖర్, చెన్నా తిరుమలరావు, మెలోడీ సత్యనారాయణ, ఎస్.జగదాంబ, యు.ఉమా ప్రియలను సత్కరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి పి.సూర్యప్రభ వ్యాఖ్యానంలో జరిగిన ఈ కార్యక్రమంలో కనక మహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల తాతాజీ, కళా సంస్థల ప్రతినిధులు కొణతాల రాజు, మహ్మద్ ఖాన్, సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ఎన్.రాజు, గిరిజా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలులో కేంద్రం విఫలం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విభజన హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు జగన్ మురారి విమర్శించారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యపై ఇప్పటికే బిఆర్ఎస్ స్పష్టమైన ప్రకటన చేసిందన్నారు.

హరివెంకట కుమారిని కలిసిన కటక్ మేయర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో నగరమేయర్ గొలగాని హరి వెంకటకుమారిని, ఒడిశా కటక్ మేయర్ సుభాష్‌చంద్ర సింగ్ దంపతులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జివిఎంసి ఆర్థిక వ్యవస్థ, బడ్జెట్, భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, సోలార్ ప్రాజెక్టులు, వీధిదీపాలు, పారిశుధ్య నిర్వహణ, కాపులప్పాడలోని జిందాల్ విద్యుత్ ప్రాజెక్టు, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమాండ్ కంట్రోల్ సెంటర్, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ముఖ్యంగా సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థను గురించి కటక్ మేయర్‌కు గొలగాని వివరించారు. అనంతరం కటక్ మేయర్ దంపతులను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

కటక్ మేయర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న హరి వెంకటకుమారి

పబ్లిక్ నోటీసు
మహారాజశ్రీ విజయవాడ 7వ అడిషనల్ జిల్లా కోర్టు నందు
ఓ.యస్.నెం. 343/2015

పోలు కోటేశ్వరరావు .... వాది
మరియు
అట్లూరి మధుకిరణ్ ... ప్రతివాది

పైన తెలిపిన దావాలో ప్రతివాది అయిన అట్లూరి మధుకిరణ్ తండ్రి : భగవత్ సింగ్, 101, హిల్ వ్యూ రెసిడెన్సీ, ఉడా కాలనీ, మధురవాడ, విశాఖపట్నం వారి హాజరు నిమిత్తం ది.12-04-2023వ తేదీన వాయిదా వేయడమైనది. కావున సదరు మధుకిరణ్‌గారు సదరు తేదీన, సదరు కోర్టుకు ఉదయం 10-30 గం.లకు హాజరై, వారియొక్క వాదనలు వినిపించుకోగలరు. అలా రానియెడల, కోర్టువారు వారి పరోక్షంలో తదుపరి చర్యలను తీసుకోగలరని తెలియజేయడమైనది.
కోర్టువారి ఆదేశాలతో ఇవ్వబడిన నోటీసు
వాయిదాతేది: 12-04-2023

ఇట్లు
ఆలూరి సుధాకరరావు,
అడ్వకేట్, విజయవాడ.
సెల్ : 9392133535.

కెజిహెచ్‌కు 10 అంబులెన్స్‌లు

- 1లోగా టెండర్లకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : హెచ్‌పిసిఎల్ సిఎస్‌ఆర్ నిధులు రూ.2.50కోట్లతో కెజిహెచ్‌కు పది అంబులెన్స్‌ల సరఫరాకు సీల్డ్ కొటేషన్ టెండర్లను ఏప్రిల్ ఒకటో తేదీలోగా ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయంలో టెండర్లు సమర్పించాలని సూచించారు. అంబులెన్స్ స్పెసిఫికేషన్స్, ఇతర వివరాలకు ముఖ్య ప్రణాళికాధికారికార్యాలయం, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మహారాజశ్రీ అనకాపల్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A. 131/2022 in E.P. 58/2005
in O.S. 39 / 1998

బిట్వీన్:
సరిసా నూకేశ్వరరావు
. . . పిటీషనర్ / D.Hr / ప్లెయింటిఫ్
అండ్:
సబ్బి సుధ
... రెస్పాండెంట్/J.D.R/ డిఫెండెంట్
టు:
సబ్బి సుధ, భర్త మహేశ్వరరావు,
హిందూ, వయసు 62 సం॥లు
వ్యాపారం, C/o. బల్లిన రామారావు,
రాజ్‌కమల్ ఫీడ్స్ ఫ్యాక్టరీసైడ్,
కొత్తూరు నర్సింగరావుపేట, అనకాపల్లి.

పై నెంబరు ఇ.ఎ.లో కోర్టు వారు పంపిన నోటీసు మీరు అందుకోనందున సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 27-03-2023 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు ఉదయం 10-30 ని॥లకు మీరు స్వయంగా గాని లేక మీ తరుపు లాయరుగారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు ఇ.ఎ. తీర్మానించబడును.

వడ్డాది వెంకట్రావు
అడ్వకేట్, అనకాపల్లి.

గ్రామ పంచాయతీ కార్యాలయము - ఏటికొప్పాక

రేఖా నెం. 13/2023 **బహిరంగ వేలం మరియు టెండరు ప్రకటన** **తేదీ.23-03-2023**

అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామ పంచాయితీకి చెందిన ఈ దిగువ 1వ షెడ్యూల్ దాఖలా గుత్తలలో 2023-24 సం॥నకు ఆశీలు వసూలు చేసుకునే హక్కులు పొందుటకు గాను తేది:27-03-2023 సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద పంచాయితీ కార్యదర్శి వారిచే మండల పంచాయితీ విస్తరణ అధికారి వారి సమక్షమున బహిరంగ వేలం నిర్వహించబడును. సదరు బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు యలమంచిలి మండల రెవెన్యూ అధికారి వారి నుండి తేది: 01-01-2023న తరువాత గల రూ.1,00,000/-లకు తక్కువ కాకుండా సాల్వెన్సీ సర్టిఫికేటు పొంది, గ్రామపంచాయితీకి దాఖలు చేసి, ఆయా గుత్తులకు ఎదురుగా సూచించిన ధరావత్తులు చెల్లించి వేలములో పాల్గొనవచ్చును. మరియు 2వ షెడ్యూల్ దాఖలా అంశములకు 2023-24 సం॥నకు పంచాయితీ నందు కాంట్రాక్టు పద్ధతిపై పనులు నిర్వహించుటకు స్టీల్ టెండర్‌ను తేది: 27-03-2023న కోరుచున్నారు. ఆసక్తి గల వారు మిగతా ఇతరములు కార్యాలయం పనిచేసే వారిని అడిగి తెలుసుకొనవచ్చును.

క్రమ సంఖ్య	గుత్తుల వివరము	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము రూ॥లు	అదనపు ధరావత్తు రూ
1.	వారపు సంతలో అశీలు వసూలు హక్కు	2023-24	5000/-	20,000/-
2.	రోజువారి మార్కెట్‌లో ఆశీలు వసూలు హక్కు	2023-24	5000/-	20,000/-
3.	కార్ల స్టాండ్ ఆశీలు వసూలు హక్కుల	2023-24	1000/-	2,000/-
4.	కబేళాలు ఆశీలు వసూలు హక్కు	2023-24	1000/-	2,000/-

క్రమ సంఖ్య	టెండరు అంశములు	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము రూ॥లు
1.	ఏటికొప్పాక గ్రామ పంచాయితీ పరిధిలో రోజువారి పారిశుధ్య పనులు సాని5టరీ మేస్రీ పనులు నిర్వహించుటకుగా 13 మనుషులను సప్లై చేయుట	2023-24	రూ.1000/-
2.	గ్రామ పంచాయితీ పరిధిలో రక్షణ మంచినీటి సరఫరా పథకములు స్విచ్ ఆన్ ఆఫ్‌లు నిర్వహణ మరిము వీధి దీపముల మరమతుల పనులు చేయుటకు 1 మనుషులు సప్లై చేయుటకు	2023-24	రూ.1000/-
3.	గ్రామ పంచాయితీకి అవసరమగు పి.హెచ్.సామానులు బ్రీచింగ్, పౌడర్, సున్నం, ఫినోయిల్, దోమల మందు, వగైరా సామాన్లు సప్లై చేయుట	2023-24	రూ.1000/-
4.	ఈ గ్రామ పంచాయితీకి అవసరమగు ఎలక్ట్రికల్ సామాగ్రి ఎల్.ఇ.డి. బుల్బులు, హోల్డర్స్, వైర్ కాయిల్స్, డూములు టేప్‌రోల్స్ వగైరా సామాన్లు కొనుగోలు చేయుటకు	2023-24	రూ.1000/-

ముఖ్య గమనిక: తేది: 27-3-2023 ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వీకరించబడిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షంలో తెరువబడును. ఆశీలు వసూలు హక్కు పొంది వృత్తిదారులు వేలంపాటలు సొమ్మును ప్రభుత్వం వారు నిర్ణయించిన ప్రకారము షరతులతో అగ్రిమెంట్ దాఖలు చేయబడును. కాంట్రాక్టు లేబర్ పనికి హాజరుకాని దినములలో వేతనం నిలుపుదల చేయును. టెండరు ప్రాప్తికి మనుషులను సప్లై చేయబడును. **సం/- శ్రీ బి.గణేష్, పంచాయితీ కార్యదర్శి**
గ్రామపంచాయితీ, ఏటికొప్పాక, యలమంచిలి మండలం, అనకాపల్లి జిల్లా.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి-యంత్రాంగం : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందిన ఘటనలు బుధవారం చోటు చేసుకున్నాయి...

తగరపువలస : స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి వలందపేట జంక్షన్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎస్ఐ హరీష్ కథనం ప్రకారం... శ్రీకాకుళం నుంచి కారులో విశాఖ వచ్చి తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం వెళ్తుండగా ఆగి ఉన్న ఆటో, లారీని తప్పించబోయి డివైడరను ఢీ కొంది. కారు పల్టీ కొట్టి ఆవల రోడ్డులో పడింది. అదే సమయంలో అటుగా వస్తున్న సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా, గార మండలం, కళింగపట్నంనకు చెందిన వ్యాపారి పట్నాన సంతోష్‌కుమార్ (32), శ్రీకాకుళం టౌన్ రాజేశ్వరి పీఠం, భావన పుత్ర నిలయంనకు చెందిన లాడే దుర్గా ప్రసాద్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమయంలో సంతోష్ కుమార్ కారును డ్రైవ్ చేస్తున్నాడు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంతోష్ కుమార్ తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రికి మెసేజ్ చేసిన గంటల వ్యవధిలోనే ప్రమాదం

"విశాఖ నుంచి శ్రీకాకుళం తిరిగి వచ్చేస్తున్నాం.. ఇంటి తలుపులు తెరిచే ఉంచండి" అంటూ మృతుల్లో ఒకరైన సంతోష్ కుమార్ తండ్రి నాగేశ్వరరావుకు మొబైల్‌తో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో మెసేజ్ పంపించాడు. మెసేజ్ పంపిన మూడు గంటల వ్యవధిలోనే రాత్రి 1 గంటకు వలందపేట జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదం చోటచేసుకుంది.

మరో ప్రమాదంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి

భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు చొక్కవానిపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మ్‌డ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. విశాలాక్షి నగర్‌కు చెందిన ఆర్మ్‌డ్ హెడ్ కానిస్టేబుల్ ఎం.సన్యాసిరావు (53) స్థానిక బ్యాంక్ కాలనీలో ఉన్న పోలీస్ ఐజి బంగ్లా వద్ద విధులు ముగించుకుని బీచ్ రోడ్డు మీదుగా హోండా యాక్టివా పై విశాలాక్షి నగర్ వెళ్తున్నారు. ఎదురుగా రోయల్ ఎన్‌ఫీల్డ్‌పై ఇద్దరు యువకులు వేగంగా వస్తూ యాక్టివాను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సన్యాసిరావుకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటా హుటిన నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సన్యాసిరావు మృతి చెందారు. సిఐ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యాన ఎస్సై తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎంఎస్‌లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో తరుచూ జరుగుతున్న ప్రమాదాల పట్ల ఎస్ఎంఎస్ - 2లో ఉక్కు యాజమాన్యం, సేఫ్టీ ఆధ్వర్యాన అవగాహన సదస్సు (మాక్‌డ్రిల్) నిర్వహించారు. గ్యాస్ ప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలో, ఎలా బయటపడాలో మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి, ప్రాణ పాయం లేకుండా ఎలా కాపాడాలనే అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎంఎస్.రావు, ఇన్‌ఛార్జి వీరకుమార్, సిఐఎస్ఎఫ్ సిబ్బంది, సేఫ్టీ యాజమాన్యం, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి గణేష్ నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు ఆధ్వర్యాన సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కెకె.రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, నాయకులు బోగవల్లి గోవిందు, హరి పాల్గొన్నారు.

వైసిపికి వ్యతిరేకంగా పట్టభద్రుల తీర్పు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టభద్రులు తీర్పు ఇచ్చారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించినా, వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి పదివేల మంది పట్టభద్రుల ఓటర్లకు వెండి నాణేలు, రూ.1,000 నుంచి రూ.2000 నగదు పంపిణీ చేసినా పట్టభద్రులు ఓట్లు వేయలేదన్నారు. నేడు జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసిపికి బుద్ధిచెప్పారన్నారు. టిడిపి అభ్యర్థి అనురాధకు ఓటు వేసి ఎమ్మెల్సీని చేశారని తెలిపారు. నియంతృత్వ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందన్నారు. విజయం సాధించిన అనురాధను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపికి ఏపీలో ప్రతిపక్ష హోదా కూడా రాకపోవచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.

సహకార సంఘాలకు యాజమాన్య ప్రతినిధులను నియమించాలి

ప్రజాశక్తి -గాజువాక : బిహెచ్ఇఎల్‌లో సహకార సంఘాలకు యాజమాన్య ప్రతినిధులను నియమించాలని సిఐటియు నాయకులు యాజమాన్యానికి మెయిల్ ద్వారా వినతి పత్రం గురువారం పంపించారు. ఉద్యోగులు, కుటుంబాలకు సహకార సంఘాలు ఎంతో ఉపయక్తంగా ఉండేవని తెలిపారు. ఇటీవల ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగినా యాజమాన్యం ఆయా సహకార సంఘాలకు, అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులను నియమించడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాలకు విపరీతమైన నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం రుణాలు పెట్టుకునే సౌకర్యం ఉండేదని తెలిపారు. తక్షణమే యాజమాన్యం సొసైటీ సహకార సంఘాలకు తమ యొక్క ప్రతినిధులను నియమించాలని సిఐటియు నాయకులు జిటిపి ప్రకాష్, కె.విజయ్.కుమార్, ఎస్.జగన్నాధరావు, పి.కనకారావు, ఎస్.అప్పారావు, జి.రాంబాబు, బి.కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు.

టీబీని అంతం చేయొచ్చు : డాక్టర్ ఫణీంద్రకుమార్

ప్రజాశక్తి -గాజువాక : టీబీ (క్షయ వ్యాధి)ని అంతం చేయొచ్చని కిమ్స్ ఐకాన్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కెఎస్.ఫణీంద్రకుమార్ తెలిపారు. కోవిడ్-19 తర్వాత మరణానికి రెండవ ప్రధాన అంటువ్యాధి టీబీ అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజూ 30,000 మంది అనారోగ్యంతో బాధపడుతున్నారని, 4400 మంది టీబీతో మరణిస్తున్నారని వివరించారు. మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల టీబీ వస్తుందన్నారు. ఊపిరితిత్తుల టీబీ ఉన్న వ్యక్తి దగ్గినా, తుమ్మినా, ఉమ్మినా, నవ్వినా, మాట్లాడినా ఆ తుంపర్ల ద్వారా వ్యాధి క్రిములు గాలిలోకి వ్యాపిస్తాయని తెలిపారు.

2 వారాల కంటే ఎక్కువ దగ్గు ఎక్కువ జ్వరం ఉన్నా, గణనీయంగా బరువు తగ్గడం, హెమోప్టిసిస్ (రక్తం దగ్గు) ఉన్నా, ఛాతీ రేడియోగ్రాఫ్‌లో ఏదైనా అసాధారణత ఉంటే టీబీ కోసం మూల్యాంకనం చేయాలని పేర్కొన్నారు. ఇలాంటి లక్షణాలు పిల్లల్లో కూడా కనిపిస్తాయని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడితే టీబీని నివారించవచ్చని పేర్కొన్నారు.

పేదలకు చేయూతనివ్వాలి

చీరలు పంపిణీచేస్తున్న నాయీ బ్రాహ్మణులు

ప్రజాశక్తి -ములగాడ : పేదలకు చేయూతనిచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జెఎసి వైస్ ప్రెసిడెంట్ కోరిబిల్లి కోటేశ్వరరావు కోరారు. పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతంలో ఉగాదిని పురస్కరించుకొని పేద నాయీ బ్రాహ్మణుల్లో వృద్ధులకు బుధవారం వైస్ ప్రెసిడెంట్ కోరుబిల్లి కోటేశ్వరరావు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన ఈ సంఘం నాయీ బ్రాహ్మణులలో పేదరిక నిర్మూలనకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పుల్లేటికుర్తి సూర్యారావు, అధ్యక్షులు గోల్కొండ రామకృష్ణ, కోశాధికారి కేసనకుర్తి మల్లేశ్వరరావు, సెక్రెటరీ ఉప్పలపు లోవరాజు, వైస్ ప్రెసిడెంట్ మంత్రిపు సింహాచలం, గౌర సలహాదారులు ఉప్పలపు శివకుమార్, కమిటీ మెంబర్ కాగుపాటి అప్పారావు, కోడూరు రాంబాబు, నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

31న గీతం అంతర్జాతీయ విద్యార్థుల ఉత్సవం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల అభ్యసిస్తున్న వివిధ దేశాలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యాన ఈ నెల 31న అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవాన్ని "సంయుక్త-23" పేరిట నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ కెపి.కిషన్ తెలిపారు. దీనికి సంబంధించిన ప్రచార పత్రాన్ని గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, ప్రోవైస్ ఛాన్స్‌లర్ (కేంపస్ లైఫ్) ప్రొఫెసర్ వై.గౌతమరావు ఆవిష్కరించారు. స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా గీతంలో ప్రవేశాలు పొందిన విదేశీ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించడం పట్ల వైస్ ఛాన్స్‌లర్ అభినందనలు తెలిపారు. సంయుక్త యువజనోత్సవం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించే అవకాశం లభిస్తుందన్నారు. కాగా ఈ నెల 31వ తేదీన జరిగే యువజనోత్సవంలో క్రీడా పోటీలతో పాటు సంగీత, నృత్య కార్యక్రమాలతోపాటు వివిధ దేశాల వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేస్తున్నట్లు గీతం అంతర్జాతీయ విద్యార్థుల అసోసియేషన్ తెలిపింది.

నేరాలు ఘోరాలు

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలో ఎఫ్‌సిఐ గోడౌన్స్ వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం పడి ఉంది. జిఆర్‌పి ఎస్ఐ కామేశ్వరరావు కథనం ప్రకారం... గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెంది ఉంటారని అభిప్రాయపడ్డారు. సదరు వ్యక్తి నీలం కలర్ నిక్కర్ దానికి నల్లటి బెల్ట్, కనకాంబరం రంగు కలిగిన హాఫ్ హాండ్స్ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మొలతాడుకు పొడవాటి బీరువా తాళం చెవి ఆకారం కలిగిన రెండు తాళాలు ఉన్నాయని వివరించారు. సుమారు 70 నుంచి 75 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. ఎవరైనా గుర్తించగలిగితే జిఆర్‌పి పోలీసులను సంప్రదించాలని కోరారు.

అదుపుతప్పి లారీ బోల్తా

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారి మనబాలపాలెం జంక్షన్ సమీపంలో లారీ బోల్తా పడింది. గురువారం విశాఖ నుంచి విజయవాడ వెళుతున్న లారీ మనబాలపాలెం జంక్షన్ వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డుకు అవతల బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు.

క్రీడలతో ఆత్మస్థైర్యం : సుమన్

ప్రజాశక్తి -గాజువాక : క్రీడలు ఆత్మస్థైర్యాన్నిస్తాయని సినీ హీరో సుమన్ అన్నారు. 65వ వార్డు పరిధి బానోజీతోటలోని బ్యూల స్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మార్షల్ ఆర్ట్స్ చైర్మన్, సినీ నటుడు సుమన్ తల్వార్ హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతోపాటు కరాటే క్రీడలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ నరసింహపాత్రుడు, కరాటే సంఘం సభ్యులు సతీష్‌కుమార్, అంగా రాము, శివగణేష్, ఎస్‌కె.రాము, కామేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చిరంజీవిరావును అభినందిస్తున్న కోరాడ తదితరులు

ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు అభినందనలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి సభ్యులుగా ఎన్నికైన వేపాడ చిరంజీవిరావును టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజాబాబుతో పాటు పార్టీ నాయకులు వానపల్లి సత్య, గిడుతూరి శ్రీనివాసరావు, జగన్నాథ గణేష్‌రెడ్డి, వానపల్లి నరసింగరావు గురువారం విశాఖ నగరంలోని ఆతని నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందించారు.

నూకాలమ్మ ఆదాయం రూ.11 లక్షలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక శ్రీ నూకాలమ్మ ఉత్సవాల సందర్భంగా రూ.11,32,287 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి కీర్తి శ్రీనివాసరావు తెలిపారు. టికెట్ల ద్వారా రూ.5,85,360, హుండీ ద్వారా రూ.5,46,927 వచ్చినట్లు వివరించారు.

చదువుతోనే మహిళలకు గౌరవం

ప్రజాశక్తి-పద్మనాభం : మహిళలు చదువుకున్నప్పుడే సమాజంలో గౌరవింపబడతారని సిబిఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి బి.సత్యవెంకట హిమబిందు తెలిపారు. మండలంలోని కుర్రపల్లి గ్రామంలో బుధవారం రూపాకుల విశాలాక్షి 97వ జయంతిని పురస్కరించుకొని పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక సమానత్వం పొందాలంటే చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చదువు ద్వారానే మహిళ తన కాళ్లపై నిలబడగలుగుతుందన్నారు. కుటుంబ వ్యవస్థను కాపాడగలిగే శక్తి మహిళకే ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఎన్.జనార్దన్ అవగాహన కల్పించారు. రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో రూపాకుల రవికుమార్, శ్రీలక్ష్మి, జి.మైథిలి, మహేష్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటం

ఆరిలోవలో మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి-యంత్రాంగం

భగత్‌సింగ్ స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్థంతిని గురువారం జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ లర్పించారు.

ఆరిలోవ : ఆరిలోవ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద ఉన్న సాయి భగత్ సింగ్ ఆటో స్టాండ్ డ్రైవర్స్ ఆధ్వర్యాన భగత్‌సింగ్ వర్థంతి సభను నిర్వహించారు. ఈ సభలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలను ఫణంగా పెట్టిన భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ పోరాట స్ఫూర్తితో హక్కుల కోసం కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను, సహజ వనరులను కార్పొరేట్లు పరం చేస్తుందన్నారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పినాకిల్ హాస్పిటల్స్ సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటోస్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీను, రమణ, ఆరిలోవ సిఐటియు కార్యదర్శి వి.నరేంద్రకుమార్, నాయకులు ఎన్.రాజేష్, సతీష్, భాస్కర్, రాము, నాయుడు, రమేష్, 40 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక పరిధి శ్రీనగర్, సుందరయ్య కాలనీ, దశమకొండ, అక్కిరెడ్డిపాలెంలో భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు ఎం.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

జివిఎంసి 67వ వార్డు పరిధి సాయిరాంనగర్‌లోని స్వామి విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపల్ పాలూరు లక్ష్మణస్వామి ఆధ్వర్యాన భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాంబాబు, కుమార్, యువకులు పాల్గొన్నారు.

తగరపువలస : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యాన స్థానిక జిఆర్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సామాజిక వేత్త ఎస్.రాంప్రసాద్, నాయకులు అల్లు బాబూరావు, ఎఐటియుసి ప్రధాన

స్వామి విద్యానికేతన్‌లో మాట్లాడుతున్న రాంబాబు

వర్థంతి సభల్లో వక్తలు

కార్యదర్శి కొండపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

స్థానిక సిఐటియు కార్యాలయంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్‌లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, డి.బాబాజీ, ఎస్.శ్రీనివాసవర్మ, సోమి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో భగత్ సింగ్ వర్థంతిని నిర్వహించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్‌లను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురం గ్రామ మండలి వద్ద ఎఐవైఎఫ్, సిపిఐ ఆధ్వర్యాన భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్థంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఎఐవైఎఫ్ నాయకులు గుడాల రాంబాబు, దొక్కాడ తిరుపతిరావు, కె.శంకరరావు, జి.రామకృష్ణ, వై.కనకరాజు, వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన 59వ వార్డు నెహ్రూనగర్‌లో భగత్‌సింగ్ చిత్రపటాలకు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు పూలమాల వేసి నివాళ లర్పించారు. 63వ వార్డు క్రాంతినగర్‌లో డాక్టర్ ప్రియాంక, 62వ వార్డు దుర్గానగర్‌లో ఎల్‌జె.నాయుడు, చింతల్లోవలో డివైఎఫ్ఐ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మల్కాపురం జోన్ అధ్యక్షులు బూడి శ్రీను, ఎస్.వాసు, రామకృష్ణ, నాని, యు.రాజు, సురేష్, డి.రాజేష్, ప్రశాంత్, జె.మోహన్, వెంకటేష్, నవీన్, బి.హరి, ఎస్.రాజు, విష్ణు, రామకృష్ణ, నరేష్, గణేష్, అర్జునరావు, మహేంద్ర, ఎల్.కృష్ణ,ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్థంతి సందర్భంగా సిఐటియు, డివైఎఫ్ఐ, ఐద్వా, వినిసి ఆధ్వర్యాన కొమ్మాది కూడలి నుంచి మధురవాడ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, డి.కొండమ్మ, ఐద్వా నాయకులు బి.భారతి, కె.సుజాత, వినిసి కార్యకర్తలు పి.రామరాజు, ఎస్.బద్రి, డివైఎఫ్ఐ నాయకులు డి.ఉమశైలజ, బి.ఉష, నరేంద్ర, జి.కిరణ్, సిహెచ్ శేషు, ఎస్ రామప్పడు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : భగత్ సింగ్ ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని, సిఐటియు నాయకులు వివి

తగరపువలస సిఐటియు కార్యాలయంలో...

నిరంకుశ, కార్పొరేట్ విధానాలపై పోరాటమే భగత్ సింగ్‌కు నిజమైన నివాళి : సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరంకుశ, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటడమే భగత్ సింగ్‌కు నిజమైన నివాళి అని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. దేశ స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ భగత్ సింగ్ 92వ వర్ధంతి సభ గురువారం సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. లోకాథనం, పార్టీ సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేట్, మతోన్మాద నిరంకుశ కోరల నుండి భారతదేశాన్ని విముక్తి చేయడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మూడు రోజుల పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో భగత్‌సింగ్ వర్ధంతి సభలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాంతంత్ర్యం కావాలని చిన్న వయస్సులోనే విప్లవ మార్గాన్ని ఎంచుకొని పోరాడిన భగత్ సింగ్ నేడు యువతకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర్య ఉద్యమ ఫలాలు పేదలకు అందకుండా కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. బిజెపి పాలన నుండి దేశానికి ముక్తి కల్పించడమే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, ఆర్.రాము, వివి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, దేముడునాయుడు, గనిశెట్టి సత్యన్నారాయణ, డి.సత్తిబాబు, ఎ.రాజు, డిడి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు, ఇండియన్ మెరి టైం యూనివర్సిటీ అధ్యాపకులు మల్ల జోగారావు పిలుపునిచ్చారు. స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం వద్ద గల భగత్ సింగ్ విగ్రహానికి శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, మల్ల జోగారావు తదితరులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, సిఐటియు నాయకులు పెంటకోట సత్యనారాయణ, సామాజిక కార్యకర్త ఆడారి శేఖర్, హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

చోడవరం : భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 92వ వర్థంతి సందర్భంగా చోడవరం పట్టణంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌వి.నాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, సిఐటియు నాయకుల దేముడునాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్ర పటానికి ఆ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు పాతల స్వామి నాయుడు పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, రిటైర్డు ఉద్యోగి ముర్రు అప్పలనాయుడు, బొడ్డు నారాయణమూర్తి, బొడ్డు శ్రీను, బొడ్డు హరీష్ పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ సినిమా హాల్ జంక్షన్లో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు జి నాయుడు, సిహెచ్.వెంకనాయుడు, బి.శ్రీను, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట:మండలంలోని చటర్జీపురం, పెద్దపేట గ్రామాల్లో స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని ఆదివాసీలు ఘనంగా నిర్వహించారు. ఏపి ఆదివాసీ జాయింట్ యాక్షన్(జేఏసి) కమిటీ జిల్లా కార్యదర్శి రామారావుదొర, తదితరులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

మునగపాకలో...

కొమ్మాదిలో కాగడాల ప్రదర్శన...

కె.కోటపాడు మండలం సూరెడ్డిపాలెంలో...

ఘనంగా బసవరాజు జన్మదిన వేడుకలు

బసవరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వీల్స్ మార్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పద్మ పూజిత ఆటో ఫైనాన్స్ వీల్స్ మార్ట్ అధినేత బసవరాజు జన్మదిన వేడుకలు దొండపర్తి వద్ద గల సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు సాయిబాబు, శ్రీనివాసరావు, వేణు, వినోద్, త్రినాథ్ పలువురు బసవరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బసవరాజు మాట్లాడుతూ తన పుట్టినరోజు వేడుకలకు విచ్చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ కన్వీనర్ బోను దుర్గ నరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హలో బీసీ చలో రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రం గోకవరం బస్టాండ్ వద్ద బీసీ గర్జన సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. జనగణనలో కులగణన జరగాలన్నారు కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయాలని, పార్లమెంట్లో బీసీల మహిళ బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగస్తులకు ప్రమోషన్లు, రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి బీసీ సోదరి, సోదరీమణులు పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పి.నివాస్, పి.దినేష్‌కృష్ణ, మురళీకృష్ణకిషోర్, యాదవ్ సత్తా, లతాలక్ష్మి, అనుచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

ఈదురుగాలులు, భారీ వర్షంతో
పంటలకు తీవ్ర నష్టం

నిండా మునిగిపోయిన టమాట పంట

ప్రజాశక్తి-చోడవరం

భారీ ఈదురుగాలులు, భారీ వర్షం కారణంగా పలు రకాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాలంగా వచ్చిన ఈ వర్షాలు అపరాల పంటలకు అపార నష్టాన్ని కలగజేశాయి. జనవరి నెలలో మెట్టు, పల్లపు భూముల్లో నువ్వులు అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంటలు కోత దశకు వచ్చింది. ఈ సమయంలో వర్షాలు కురవడంతో నువ్వుల పంటలు పూర్తిగా పనికి రాకుండా పోయాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందే ఆరుతడి పంటల్లో నువ్వు పంట ప్రధానమైనది. వర్షాలకు ఈ పంటంతా దెబ్బ తినడంతో రైతులు చేతికొచ్చిన ఆదాయం పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఈదురుగాలులతో మామిడి పంటకు తీరని నష్టం జరిగింది. వర్షాలు, ఈదురుగాలుల వల్ల మొత్తం మామిడి పింజులు నేలరాలాయి. అరటి పంట జరిగిన నష్టం చెప్పనవసరం లేదు. పూర్తి స్థాయిలో నేలకొరిగింది. రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులతో నష్టాన్ని అంచనాలు వేసి పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి తోట

నేలకొరిగిన అరటి తోట

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భారీగా ఈదురు గాలులు వేయడంతో పంటలు నేలపాలయ్యాయి. శానాపతి త్రినాథ్‌కు చెందిన రెండున్నర ఎకరాలలో గల అరటి తోట నేలకొరిగింది. చెట్లు మొత్తం విరిగిపోవడంతో లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

పంట నష్టాన్ని నమోదు చేయాలి

ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి అచ్యుతాపురం : నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది, అధికారులు పర్యటించి పంట నష్టాలను నమోదు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గురువారం వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ప్రధానంగా నువ్వు పంట దెబ్బతిన్నదన్నారు. మొక్కజొన్న, మినుములు, పెసలు, అరటి తోటలు, ఇప్పుడే నాటిన చెరుకు నాట్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఎకరాకు రూ.10వేలు నుండి రూ.25 వేల వరకు రైతులకు పెట్టుబడులు పెట్టి నష్ట పోయారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆదినారాయణ, రాము, పోలవరపు పారునాయుడు, కర్రి రాము, శరణం అప్పలనర్స, కర్రి కళావతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నీటిలో ఉన్న పంటను పరిశీలిస్తున్న అప్పారావు, రైతులు

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

దేవరాపల్లి : మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో గతమూడు రోజులు నుండి కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పంటనష్టం అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన వర్షం నీటితో మునిగిపోయిన పంటలను పరిశీలించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదురుగాలుల ప్రభావంతో వందలాది ఎకరాల్లో అరటి తోటలు నేల మట్టమయ్యాయని తెలిపారు. నువ్వులు, వెరుశనగ, కాయగూరలు పంటలకు, జీడి, మామిడి పంటలకు తీవ్రనష్టం జరిగిందని పేర్కొన్నారు. తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరారు.

అవార్డు అందుకుంటున్న రఘునాథ్

సాయం రఘుకు రాష్ట్రస్థాయి ఉత్తమ రైతు అవార్డు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట గ్రామానికి చెందిన సాయం రఘునాథ్ బుధవారం గుంటూరులోని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. వ్యవసాయంలో నూతన ఆలోచనలు, ఆధునిక పద్ధతులను అవలంభిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్న రఘునాథను ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. ఉగాది సందర్భంగా రఘునాథ్‌కు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆదోల విష్ణువర్ధన్ రెడ్డి, విస్తరణ సంచాలకులు బివి జయ చేతుల మీదుగా అవార్డు, ప్రశంస పత్రాన్ని అందజేశారు. రఘునాథ్‌ను పలువురు అభినందించారు. రఘునాథ్ 2019లో చోడవరం డివిజన్ స్థాయి ఉత్తమ కృషి అభియాన్, 2020, 21 సంవత్సరాలలో అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో జిల్లా స్థాయి ఉత్తమ రైతు అవార్డులను అందుకున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పెద గొల్లలపాలెం పంచాయితీ శివారు అప్పయ్యపాలెం గ్రామానికి చెందిన ఉప్పిలి లక్ష్మణరావు ఇటీవల ప్రమాదంలో గాయపడి కాలు దెబ్బతినడంతో మంచాన పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు బర్ణికాన బాబూరావు సంఘం తరుపున రూ.70వేలు ఆర్థిక సాయం గురువారం బాధితుడు లక్ష్మణరావుకు మండల కేంద్రంలోని కృష్ణ మందిరంలో సంఘం సభ్యుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పల్లా కృష్ణ, సంఘం మండల ప్రధాన కార్యదర్శి పల్లా తాతారావు, నాయకులు ఈపు అప్పలరాజు, పల్లా సన్యాసిరావు, పల్లా సత్యనారాయణ, గొంప సంజీవరావు, పల్లా రమణ, ఉప్పులి అప్పలరాజు, ఉప్పిలి అచ్చిబాబు, ఉప్పులి సోమేశ్వరరావు, ఉప్పిలి సంతోష్, ఉరుకూటి అప్పలరాజు, సారిపల్లి సంతోష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఎఇ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నూరుపాలెం, తీడ, ఆనందపురం, చెరకాం, కప్పాలపాలెం, కొత్తూరు, చిన్నయ్యపాలెం, భీమవరం, అడ్డం, అచ్చెర్ల, బయ్యవరం, మోసయ్యపేట, గొకివన్నపాలెం, సింగవరం తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : 2022-23 ఆర్థిక సంవత్సరంలో కల్లుగీత కార్మికుల సంక్షేమం నిమిత్తం ఆ సంఘానికి రూ.5 వేల కోట్లు నిధులు కేటాయించాలని ఏపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లాలోనూ కల్లు ఫ్యాక్టరీని స్థాపించి గీత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుడు చెట్టు మీద నుంచి పడిపోతే రూ.10లక్షలు, తాత్కాలిక వికలాంగులైతే రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. గీత కార్మిక సంఘం ద్వారా బీసీ కార్పొరేషన్ నుంచి 50శాతం సబ్సిడీపై గీత కార్మికులకు రూ.2 లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని, తాటికల్లు వల్ల ఉపయోగాలపై ప్రభుత్వం ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు జెఎంపిఎస్ జిల్లా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా చైర్మన్ గంట శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పశుసంవర్ధక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనుబాబు హాజరవుతున్నారని, జిల్లాలో ఉన్న సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధి అంబేద్కర్ నగర్‌లో రూ.26 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.8లక్షలతో పాత సులాబ్ కాంప్లెక్స్ మరమ్మతులు, రూ.10 లక్షలతో గ్రామ కంఠానికి ప్రహరీ గోడ నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులు, రూ.6 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, వైస్ సర్పంచు చదరం చిన్న, ఎంపిటీసీ సభ్యులు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, స్థానిక నాయకులు పీల విశ్వేశ్వరరావు, మొగసాల లక్ష్మీ వెంకట్, రవ్వ భవాని శ్రీనివాసరావు, జెర్రిపోతుల లక్ష్మి, వెలగా మోదునాయుడు, తర్రా సత్యారావు, యర్రంశెట్టి రామారావు, గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాగిజావ పాత్రల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని సత్యనారాయణపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ వంట పాత్రలను స్కూల్ కమిటీ చైర్మన్ పక్కుర్తి వెంకటరావు తన సొంత నిధులతో కొనుగోలు చేసి గురువారం అందజేశారు. విద్యార్థులకు అరటిపళ్ళు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గండేపల్లి తులసి లక్ష్మి, సిఆర్పి నీలవేణి, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జోగా నాగమణి, ఉప సర్పంచ్ భవాని, పలక సత్తిబాబు జోగా నాగబాబు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా భావన రుషీశ్వర కల్యాణం

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ గ్రామంలో ప్రసిద్ధగాంచిన శ్రీభావన రుషి దేవస్థానంలో భావనరుషి, భద్రావతి దేవీల కల్యాణ మహోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో ముందుగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించి, అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై విగ్రహాలను ఉంచి, అర్చక బృందం కల్యాణ తంతు జరిపించారు. పలువురు నూతన దంపతులు ఈ వేడుక నిర్వహించారు. గవర్ల అనకాపల్లి, నారాయుడుపాలెం, సిరసపల్లి గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్మకర్తలు దొడ్డి రాజు, సూర్యనారాయణ, త్రినాధ్, సన్యాసిరావు, సత్యనారాయణ, తాతబాబు, స్థానికులు సత్యం, బాబురావు, అప్పారావు, అప్పలరాజు పాల్గొన్నారు.

కల్వర్టులను పునర్నిర్మించాలని ఆందోళన

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం -వెంకన్నపాలెం రోడ్డులోని శిథిలమైన కల్వర్టులను వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం చోడవరం మండల కమిటీ ఆధ్వర్యంలో వెంకన్నపాలెం కల్వర్టు వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కల్వర్టు కూలిపోయే స్థితిలో ఉందని, రక్షణ గోడలు కూలిపోవడంతో ఇటీవల కారు కాలువలో పడిపోయిందని, అనేక మంది వాహనదారులు రోజూ ప్రమాదాలకు గురౌతున్నారని తెలిపారు. బ్రిడ్జి కూలిపోయే స్థితిలో ఉన్నా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. అనకాపల్లి, పాడేరు, విశాఖ జిల్లాల కేంద్రాలకు ప్రధాన రహదారిగా ఉన్న దీనిపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేని చేతగాని నాయకులు ఇక్కడ ఉన్నారన్నారు. వెంకన్నపాలెంకు చెందిన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఏడాదిగా హెచ్చరిక బోర్డులు పెడుతున్నా ప్రజాప్రతినిధులు స్పందించలేదని దుయ్యబట్టారు. ప్రమాదకర కల్వర్టులను వెంటనే పునర్నిర్మించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం చోడవరం నాయకులు ఎన్‌వి.నాయుడు, జోగ రాము, పల్లా సత్తిబాబు, జి.హరి, శ్రీను, కొణతాల అప్పలనాయుడు, ఆదినారాయణ, రాపేటి గంగాధర్, రాజు, కొణతాల రాము, సింహాచలం పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

ఘనంగా ఉగాది పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. గ్రాడ్యుయేట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మొట్టమొదటి ఇంజనీరింగ్ పట్టభద్రులు బుద్ద విజయ్ కుమార్ (స్టీల్ ప్లాంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్), ఎంఆర్ఎస్ అప్పారావు (జివిఎంసి ఇంజనీర్), గవర్ల అనకాపల్లి గ్రామంలోని మొట్టమొదట చార్టెడ్ అకౌంట్ పోలనాటి బాలకృష్ణ గోవిందు, సైన్యంలో చేరిన కొల్లూరి వెంకట సత్యనారాయణ, ఏవిజి రాజు, దిమిలి మోహన్, బొడ్డేడ సాయి లోకేష్, బొడ్డేడ సురేష్ గోపి, బొడ్డేడ జగదీష్, దాడి వెంకటేష్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపి ప్రభుత్వ సలహాదారుని పర్సనల్ సెక్రటరీ కెవిఎ.శివ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల మరో పది మంది గొప్ప విద్యావేత్తలు తయారవుతారని తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్‌కు రూ.10వేలు విరాళంగా ప్రకటించారు. ఆళ్ళ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తోటాడ సర్పంచ్ దొడ్డి మంగ వేణి, ఎంపిటీసీ కాండ్రేగుల వెంకట లక్ష్మి, గ్రామ పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు, కృష్ణమోహన్, విశాఖపట్నం వండర్ కిడ్స్ అధినేత మళ్ల రామునాయుడు, బిఎంపిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మళ్ల జగదీష్, సాధన సంస్థ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, క్లబ్ మెంబర్లు ఆళ్ళ విజయకుమార్, డాక్టర్ దాడి భాస్కర్, అంగులూరి రామకృష్ణ, ఎస్ రవి, డి శ్రీధర్, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

మిలెట్స్‌తో తయారు చేసిన పదార్థాలను పరిశీలిస్తున్న ఎంపిపి

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ పక్వాడ'

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల పరిషత్ మెయిన్ స్కూల్ అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ కార్యక్రమాలను గురువారం ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి ప్రారంభించారు. అనంతరం కూరగాయల ప్రదర్శన, మిలెట్స్‌తో తయారు చేసిన పదార్థాల డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ వి.మంగతాయారు, ఎంపీడీఓ సిహెచ్ సుబ్బలక్ష్మి, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, సచివాలయం సెక్రటరీ పి.నాగరత్నం, సచివాలయ ఏఎన్ఎంలు జయసుధ, హేమ, అంగన్వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని జె.తుని అంగన్వాడీ కేంద్రం వద్ద పోషణ్ పక్వాడ కార్యక్రమం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ, వైసిపి నాయకులు కోన నాగేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుచరిత, స్వర్ణ ప్రియ, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని లైను కొత్తూరులో గురువారం ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యలమంచిలి ఐసిడిఎస్ సిడిపిఓ కె.ఇందిరాదేవి మాట్లాడుతూ చిరుధాన్యాల ద్వారా బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాదరావు, ఇఓఆర్డీ జిఎంఎస్‌కె, ఎంపిహెచ్ఒ, ఏఎన్ ఎం, ఆశా, ఐకెపి, సూపర్వైజర్స్, లైన్‌కొత్తూరు కాలనీ, రేగుపాలెం, పోతిరెడ్డిపాలెం గ్రామాల బాలింతలు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలు

ప్రజాశక్తి-సబ్బవరం : సకాలంలో ఇంటిపన్నులు చెల్లించి పంచాయితీ అభివృద్ధికి సహకరించాలని స్థానిక ఈఓపిఆర్డీ మహేష్ పిలుపునిచ్చారు. సబ్బవరం పంచాయితీ పరిధిలోని సాయినగర్ కాలనీలో గురువారం ఇంటింటికి వెళ్లి ఇంటిపన్నులు వసూళ్లు చేశారు. సబ్బవరం-4 సచివాలయం పరిధిలోని వాలంటీర్లకు ఇంటి పన్నుల వసూళ్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం కార్యదర్శి కె.మూర్తిబాబు, పలువురు వాలంటీర్లుపాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని బొద్దపువాని పాలెం గ్రామంలో దుర్గమాంబ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, యంత్ర సహిత శిఖర ప్రతిష్ట, పూజ కార్యక్రమాలు ఈ భోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పెందుర్తి నియోజకవర్గ నాయకురాలు గొన్న రమాదేవి, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, నాయకుడు అర్జిల్లి అప్పలరాజు, భారతి, మాజీ జెడ్పిటిసి పైలా జగన్నాథరావు, మాజీ ఎంపిపి ఎం.అప్పలనాయుడు, వి.చిన్న, అట్టా సన్యాసప్పారావు, బొద్దపు బాలాజీ నాయుడు, వైసిపి నాయకులు పైలా శ్రీనివాసరావు, జెడ్పిటిసి పైలా సన్యాసిరాజు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న పెళ్లి రాట ఉత్సవం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానంలో స్వామివారి వివాహానికి ముందు ఉగాది రోజున ఏటా పెళ్లి రాట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామివారి పెళ్లిరాట ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం పండిత సదస్సు, పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని పండితులు నిర్వహించారు.

'ఆసరా'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట : మహిళలు మూడో విడత ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం సచివాలయం వద్ద ఆసరా కరపత్రాలు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిటిసి లగిశెట్టి భవానీ, మండల కోఆప్షన్ సభ్యులు అద్దంకి సత్యనారాయణ, ఎపిఎం ఎం.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, సిఎ భ్రమరాంబ, రూపా మహిళలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

ఉత్తమ ప్రదర్శనలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక వివి రమణ రైతు భారతి ఆడిటోరియంలో ఈనెల 20 నుంచి 22 వరకు జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఘనంగా ముగిశాయి. మూడవరోజు కొత్త పరిమళం, పక్కింటి మొగుడు నాటికలను ప్రదర్శించారు. ఈ మూడు రోజుల పోటీల్లో ఉత్తమ ప్రథమ ప్రదర్శనగా బోరువంక సర్వాణి గ్రామీణ గిరిజన సంఘం ప్రదర్శించిన 'కొత్త పరిమళం', ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గుంటూరు అమృత లహరి ఆర్ట్ థియేటర్ వారి 'నాన్న నేనొచ్చేస్తా', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖపట్నం నటరాజ్ ఆర్ట్స్ క్రియేషన్స్ వారి 'లాస్ట్ జడ్జిమెంట్' నాటికలు నిలిచాయి. ఉత్తమ జ్యూరీ అవార్డును కొప్పోలు పండు క్రియేషన్స్ వారి 'పక్కింటి మొగుడు' దక్కించుకుంది. ఉత్తమ నటుడు అవార్డు స్వర్ణకమలం నాటికలోని శ్రీహర్ష పాత్రధారి శ్రావణ్ ప్రసాద్, ఉత్తమ నటి నాన్న నేనొచ్చేస్తాలో సావిత్రి పాత్రధారి అమృత వర్షిని, ఉత్తమ హాస్యనటుడు బరిబత్తుల రాజు నాటికలో మనీష్, ఉత్తమ సహాయ నటుడు ఇదే నాటికలో తాళాబత్తుల వెంకటేశ్వరరావు, ఉత్తమ దర్శకుడు కొత్త పరిమళం నాటిక దర్శకులు బిఎంఎస్ పట్నాయక్, ఉత్తమ సంగీత దర్శకులు ది లాస్ట్ జడ్జిమెంట్ నాటిక సంగీత దర్శకులు పి.లీల మోహన్, ఉత్తమ ఆహార్యం కేటగిరీలో నాన్న నేనొచ్చేస్తా నటి ఎం.అమృత వర్షిని, ఉత్తమ నాటక రచయిత కేటగిరీలో కొత్త పరిమళం రచయిత బిఎంఎస్ పట్నాయక్ అవార్డులు అందుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా దండు నాగేశ్వరరావు, బొబ్బిన ధవలేశ్వరరావు, కె.శేషగిరిరావు వ్యవహరించారు. బహుమతులను క్రిర దివాకర్ అందజేశారు. నిర్వాహకులు పిసిహెచ్ నాయుడును డైమండ్ హిట్స్ తరఫున దాడి రత్నాకర్, ప్రముఖ రంగస్థలం నటుడు పిళ్ల సన్యాసిరావును మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ విష్ణుమూర్తి, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిలపరశెట్టి బాబి, కె యం నాయుడు, భీశెట్టి కన్న అప్పారావు, సూరిశెట్టి రమణ అప్పారావు, విల్లూరి రాము, చదరం నారాయణరావు, సూరిశెట్టి రాము పాల్గొన్నారు.

నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

- సెలవు దినాలు, రాత్రి సమయంలో దందా
- రాయపుర అగ్రహారం ప్రజలు ఫిర్యాదు

చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని రాయపుర అగ్రహారంలో సెలవు దినాల్లోనూ, రాత్రి సమయంలోనూ గ్రావెల్‌ను యథేచ్ఛగా అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. దీనిపై ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తూ మీన మేషాలు లెక్కిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయపురఅగ్రహారం రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 60లో బోడిమెట్ట ఆ గ్రామానికి ఆనుకొని ఉంది. ఈ మెట్ట నుండి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ సెలవు దినాల్లోనూ, రాత్రి సమయంలోనూ గ్రావెల్‌ను అక్రమంగా తవ్వకాలు చేసి విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కొంతమంది గ్రావెల్ మాఫియాతో చేతులు కలిపి సెలవు దినాల్లో తవ్వకాలు చేయిస్తున్నట్లు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. అధికారులకు ఫోన్ చేస్తే సెలవు దినాల్లో మేమేం చేయగలమని సమాధానం ఇస్తూ తప్పించుకుంటున్నారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలను నిలిపి, గ్రావెల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

మజ్జిగ పంపిణీలో పాల్గొన్న నాయకులు

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -మధురవాడ : ఉగాది సందర్భంగా కొమ్మాది కూడలిలో బస్ స్టాప్ వద్ద ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన ఉగాది పచ్చడి, మజ్జిగను పంపిణీ చేశారు. నాయకులు బి.డి.పాని ప్రారంభించిన ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మందికి మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా సిఐటియు, ఐద్వా నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయంపై ఈ తెలుగు సంవత్సరాది సందర్భంగానైనా అధికార వైసిపి ప్రతిపక్ష టిడిపిలు గళ మెత్తాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు, సిఐటియు జోన్ అధ్యక్షులు డి.కొండమ్మ, ఐద్వా కార్యదర్శి బి.భారతి, నాయకులు కె.సుజాత, కె.పుష్ప, బి.ఉషారాణి, టికె.శారద, పి.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం ఎంఇఒగా బాలామణి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం ఇన్‌ఛార్జి ఎంఇఒగా కె.బాలామణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంఇఒ పద్మావతి ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు భీమిలి ఎంఇఒగా పనిచేస్తున్న బాలామణికి ఆనందపురం అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో బాలామణి మండలంలో బోయపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఎంఇఒ నియామకం పట్ల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్ అంబేద్కర్ హర్షం వ్యక్తం చేశారు.

ముకుందపురంలో ఇండో హ్యూమన్ రైట్స్ సభ్యులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం ముకుందపురం గ్రామంలో గురువారం ఇండో హ్యూమన్ రైట్స్ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రాజాన ప్రసాదరావు మాట్లాడుతూ కొట్ల వరలక్ష్మి, రాజాన విజయ భూమిని ముకుందపురంలో స్థానిక సర్పంచ్ అండతో కొంతమంది ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని సివిల్ కోర్టులో ఫిర్యాదు చేశారని, తమపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నా వారిపై మానవ హక్కుల కమిషన్‌కు ఈ నెల17న ఫిర్యాదు అందినట్లు తెలిపారు. దీనిపై పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. బాధితులకు పక్కా ఆధారాలు ఉన్నా సర్వేకి అధికారులను పిలవగా స్థానిక సర్పంచ్ తన బలాన్ని ఉపయోగించి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని మానవ హక్కుల కమిషన్ అధికారులు తెలిపారు. భూమికి సంబంధంలేని కడగల వరలక్ష్మి, కొట్ల కాసులమ్మ, దేవి, సంజయ్, భారతి నలుగురు మహిళలు పరిశీలినా బృందాన్ని అడ్డుకున్నారు. ఈ విషయంపై ఉన్నత అధికారులకు సమాచారం అందించామన్నారు. మానవ హక్కులకు ఎక్కడ ఉల్లంఘనలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు సంస్థ పోరాడుతూనే ఉంటుందన్నారు. బాధితురాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ సుగుణ కుమార్, జనరల్ సెక్రటరీ హ్యాపీ జయకుమార్, వైస్ ప్రెసిడెంట్ కరుణాకర్ రావు, విశాఖపట్నం సెక్రటరీ దుర్గారావు విజయనగరం జిల్లా ప్రెసిడెంట్ అప్పారావుతోపాటు వికారెడ్డి నాయుడు ఉన్నారు.

ఘనంగా ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-చోడవరం

ఉగాది సందర్భంగా బుధవారం ప్రసన్న భారతీయ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమ సమాజంలో శాస్త్రీయ సంగీతం, పిల్లల కోలాటం, కవిత సమ్మేళనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వ్యక్తులను సన్మానించారు. నూకాంబిక కళ్యాణ మండపంలో పౌరాణిక నాటిక ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా కళాకారులను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బిర్లంగి రామ్ నరేష్, ఆర్ట్ డైరెక్టర్ డిఎస్ ప్రసాద్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఒరుగంటి రాంబాబు, ఎం దేముడు, ఏఆర్‌జె శర్మ, రెడ్డిపల్లి అప్పలరాజు, సీతారామచార్యులు, ప్రాత రాజశేఖర్, ఎం స్వామి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి పూజలు

ప్రజాశక్తి -అనకాపల్లి

ఉగాదిని పురస్కరించుకొని శ్రీనూకాంబిక అమ్మవారిని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బీవీ సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, మాజీమంత్రి దాడి వీరభద్రరావు కుటుంబీకులు, ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం దంపతులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రామ్మూర్తి, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, దాడి రత్నాకర్, దాడి జైవీర్, దాడి జగన్ ప్రభాకర్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జాజుల రమేష్, కొణతాల మురళీకృష్ణ, దాడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'కస్తూరిబా'లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ, నేలతేరు గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో 6, 11వ తరగతిలో ప్రవేశాలు, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేక అధికారి చంద్రకళ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 352 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2023 -24 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, అనాథలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

చిరు ధాన్యాలతో అధిక పోషకాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : చిరుధాన్యాలు తినటం వలన అధిక పోషకాలు లభించి ఆరోగ్యకరంగా జీవించడానికి ఎంతగానో తోడ్పడతాయని ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి అన్నారు. మండల మహిళా సమాఖ్య పరిధిలోని గ్రామ సమైక్య సంఘం అధ్యక్షులకు విజన్ బిల్డింగ్‌పై వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.ప్రభాకరరావు అధ్యక్షతన గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. చిరుధాన్యాలను సాగు చేయడం వలన అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిలు, అకౌంటెంట్ దేవి, ఏసి ఉమా ప్రసాద్ పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన వృక్షాలు

రాజాం రోడ్డులో కూలిన చెట్టు

ప్రజాశక్తి-బుచ్చయ్య పేట : మండలంలోని రాజాం-తట్టబంద రోడ్‌లో చింతపాక జంక్షన్ వద్ద గురువారం కురిసిన వర్షానికి, ఈదురు గాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో సీతయ్యపేట నుండి పెద్దమదన, బుచ్చయ్యపేట, కొండ పాలెం, తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలిసిన చింతపాక సర్పంచ్ గోలజాన శ్రీను కటింగ్ మిషన్ తెప్పించి రోడ్డు అడ్డంగా ఉన్న వృక్షాన్ని తొలగించే ఏర్పాట్లు చేశారు.

మునగపాకరూరల్:మండలంలో బుధవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన కుండపోత వర్షానికి పలుచోట్ల వృక్షాలు నేలకూలాయి. భారీ వర్షానికి పెనుగాలులు తోడు కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్నిచోట్ల వృక్షాలు రహదారులపై పడటంతో వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ఇటు ప్రయాణికులు, అటు రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

కశింకోట : కశింకోట మండలం తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీంలో నర్సీపట్నం వెళ్లే రోడ్డులో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు చెట్టు కూలిపోయింది. ఆ సమయంలో రెండు వైపులా నుండి వాహనాల రాకపోవడంతో ప్రమాదం తప్పింది. జోరుగా వర్షం కురుస్తున్న సమయంలో ఒక్కసారి గా చెట్టు కూలింది. దీంతో అనకాపల్లి - నర్సీపట్నం రెండు వైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

రావికమతం:మండలంలో మూడు రోజులు గా ఈదురుగాలులతో కురుస్తున్న వర్షానికి పలుచోట్ల చెట్లు, ఎలక్ట్రికల్ స్తంభాలు విరిగిపడడంతో ప్రజలు కొంత అసౌకర్యానికి గురవుతున్నారు. గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎలక్ట్రికల్ స్తంభాలు, వైర్లు తెగి పడటంతో వాహన దారులు, పాదచారులు అసౌకర్యానికి గురయ్యారు. మండలంలో రావికమతం జడ్పీ హైస్కూల్, గర్నికం, చినపాచల, తదితర గ్రామాలలో ఈ వర్షానికి చెట్లు పూర్తిగా విరిగి పడ్డాయి. జీడి మామిడి తోటలు దెబ్బతిన్నాయి.

కొత్తకోట:రావికమతం మండలంలో గురువారం ఈదురు గాలులకు పలు చోట్ల చెట్లు నేల కొరిగాయి. దీంతో వాహన దారులు నానా అవస్థలు పడ్డారు. బి ఎన్ రోడ్డులో టి.అర్జా పురం సమీపంలో రెండు చెట్లు, రావికమతం ఎస్సి బాలకల వసతి గృహం వద్ద భారీ చింత చెట్టు నెల కొరిగి రోడ్డుకు అడ్డంగా పడటం తో వాహన దారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. టి.అర్జా పురం జంక్షన్ సమీపంలో మత్స అర్జున సిమెంట్ దుకాణం కూలడంతో 250 సిమెంట్ బస్తాలు, 45 తవుడు బస్తాలు వర్షానికి తడిసి ముద్దయి తీవ్ర నష్టం వాటిల్లింది. బుధవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో కొత్తకోట, కొత్తపట్నం, దొండపూడి, కన్నం పేట తదితర గ్రామాలలో భారీ వర్షం కురవడం తో పాటు గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులు వీయడం తో జన జీవనం స్తంభించింది.

కొత్తకోట బిఎన్ రోడ్డులో కూలిన చెట్టు

మాట్లాడుతున్న డిఎల్‌పిఒ

ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇంటి పన్నులు శత శాతం వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని డిఎల్‌పిఒ మూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా ఇంటి పన్నుల వసూలుపై పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలోపు ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.గ్రామాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

మండపానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలోని కొరుప్రోలు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వెంకన్న గుడి మండపానికి గ్రామ పెద్దలు శంకుస్థాపన చేశారు. గురువారం ఉదయం స్థానిక వైయస్సార్ కాలనీ వద్ద దమ్ము వెంకటరమణ దంపతులు మండపా నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. గ్రామస్తుల సహాయ సహకారంతో త్వరలో ఆలయం పూర్తి చేయనున్నట్లు వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు కేకు రామరాజు, సర్పంచ్ కొరపాటి గోపాలం, కోర రామారావు, శ్రీ సీతారామస్వామి ఆలయ ధర్మకర్త యరమాటి సూరిబాబు, ప్రత్తిపాటి చంద్రరావు, కొర్రెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న వెంకటరమణ దంపతులు

టిడిపి నేతల సంబరాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన పంచుమర్తి అనురాధ ఎమ్మెల్సీగా గెలుపొందడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు మండలంలో సంబరాలు చేసుకున్నారు. ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేపాడ చిరంజీవిరావు విజయం సాధించడతో జోరు మీద ఉన్న తెలుగు తమ్ముళ్లకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, మండల తెలుగుదేశం నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు, మాజీ సర్పంచులు డొంకిన అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ ఎంవివి సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి వియ్యపు అప్పారావు, మాజీ సర్పంచ్లు కోట సత్యనారాయణ, మల్రెడ్డి బుజ్జి, తమరాన సింహాద్రి అప్పుడు, దొడ్డి కిషోర్, డిసిసిబిమాజీ డైరెక్టర్ కోరుకొండ రవికుమార్, దాసరి సత్యారావు, ఎంపీటీసీ కంచిపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ ముచ్చకర్ల తాతీలు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్.రాయవరం:ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి అనురాధ గెలుపొందడంతో టిడిపి నాయకులు గురువారం రాత్రి మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. సీనియర్ టిడిపి నాయకులు కందుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పట్టభద్రుల ఎన్నికలలో ఉద్యోగులు జగన్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. క్రాస్ ఓటింగ్ వేసి అనురాధను గెలిపించడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో విజయ చిహ్నం చూపుతున్న నేతలు

సమస్యలపై జర్నలిస్టుల నిరసన

నర్సీపట్నంలో నిరసన చేపడుతున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో గురువారం నిరసన చేపట్టారు. ముందుగా ఎన్టీఆర్ స్టేడియంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి అబీద్ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు స్వామి, ఏపీ ఈఎంజేఏ రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.నానాజీ, స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎస్ చిన్నయ్య నాయుడు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బాబ్జి, ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్, ఉపాధ్యక్షులు స్వామి నాయుడు, మద్దు రామకృష్ణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పారావు పాల్గొన్నారు.

నక్కపల్లి:ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఐజేయు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమం లో భాగంగా పాయకరావుపేట ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా ప్రెస్ క్లబ్ ల ఆధ్వర్యంలో నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ముందుగా సుబ్బి రామిరెడ్డి కళ్యాణ మండపం నుండి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు కొరాడ చంద్రరావు మాట్లాడుతూ, నక్కపల్లి లో 26 మంది పాత్రికేయులకు గత తెలుగుదేశం పార్టీ హయాంలో పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. వీటిని రెవిన్యూ అధికారులు తీసుకుని పాత్రికేయులకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, లోవరాజు ,రాణా, లోవరాజు, వెంకటరమణ, వెలగా లోవరాజు, డివి మురళీకృష్ణ, దవర సింగి రాంబాబు పాల్గొన్నారు.

పెండ్లి రాట వేస్తున్న అర్చకులు, గ్రామ పెద్దలు

ఉపమాకలో పెండ్లి రాటోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో భువనేశ్వరదేవి సమేత లక్ష్మణేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం శివపార్వతుల పెండ్లి రాటోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, అర్చకులు మహేష్, వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు వేద మంత్రోచ్ఛారణ నడుమ పెండ్లి రాటోత్సవాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 1న లక్ష్మణేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవము నిర్వహించనున్నట్లు తెలిపారు.ఐదు రోజులపాటు స్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, గ్రామస్తులు కొప్పిశెట్టి కొండబాబు, సిద్ద బత్తులకృష్ణ, కొప్పిశెట్టి వెంకటరమణ, గరగ సూర్యనారాయణ, నాని,కొప్పిశెట్టి బుజ్జి, హరి పాల్గొన్నారు.

గీతాలు ఆలపిస్తున్న భజన బృందం సభ్యులు

ఆకట్టుకున్న భక్తి గీతాలు

ప్రజాశక్తి - నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరకవీధి రామాలయంలో శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో గురువారం ఉదయం సప్తాహం (భజన) కార్యక్రమం ప్రారంభించారు.. ఈనెల 30న జరిగే సీతారాముల కళ్యాణోత్సవాల్లో భాగంగా 7 రోజులపాటు భజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీనివాస భక్త సమాజ బృంద సభ్యులు, గ్రామస్తులు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బృంద సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 23న ఉదయం 6 గంటల నుండి 30 వ తేదీ ఉదయం 6 గంటల వరకు భజన కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 30న సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా అన్న సమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా నూకాంబిక జాతర

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలోని దాలింపేట గ్రామంలో నూకాంబికా అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయంకు చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించారు. ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్ళు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు నీటి సదుపాయాలు ఆలయ కమిటీ సభ్యులు కల్పించారు. వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు.

గొలుగొండ:మండలంలో లింగంపేట గ్రామంలో నూకాలమ్మ తీర్థ మహోత్సవాలకు గురువారం భారీగా భక్తులు తరలివచ్చారు. భారీ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. జెయింట్‌వీల్, రంగుల రాట్నం, సర్కస్‌లు ఏర్పాటు చేశారు.

ఆలయ ముఖద్వారం వద్ద భక్తుల సందడి

'జగనన్న పెళ్లి కానుక'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -రావికమతం:జగనన్న పెళ్లికానుక పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కవగుంట సర్పంచ్ దాసరికుమారి వరహాలు కోరారు. ఈ సందర్భంగా కవగుంట గ్రామంలో ఇటీవల వివాహం జరిగిన దంపతులు పెళ్లి కానుకకు దరఖాస్తు చేసుకొనగా సర్పంచ్, గ్రామ పెద్దల సమక్షంలో అధికారులు విచారణ జరిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, జగనన్న పెళ్లికానుక పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ పథకానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు లక్ష రూపాయలు, ఓసీ, బీసీ, మైనారిటీలకు రూ.75 వేలు, కులాంతర వివాహాలకు 1,50,000 వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. వివాహ సర్టిఫికెట్ , ఆదాయ, కుల, ఆధార్, రేషన్, టెన్త్ క్లాసు సర్టిఫికెట్ ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శ్యామ్, మహేష్ వైసీపీ నాయకులు నాగరాజు, ములుకూరి కిషోర్, స్కూల్ కమిటీ చైర్మన్ ప్రగడ నాయుడు బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అయ్యన్నను కలిసిన డాక్టర్ రాజశేఖర్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సార్వత్రిక ఎన్నికలకు మరొక ఏడాది కాలం ఉన్నప్పటికీ నర్సీపట్నంలో కొత్త రాజకీయాలకు నాంది పలుకుతున్నాయి. నర్సీపట్నంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి విధేయంగా ఉన్న డాక్టర్ రాజశేఖర్, ఆయన కుమారుడు లక్ష్మీ కాంత్ ఉగాదిన అయ్యన్నను కలిశారు. రాజశేఖర్ రెడ్డిపై ఉన్న అభిమానంతో ఆయన నిర్మించిన ఆసుపత్రికి సైతం రాజశేఖర్ పేరు పెట్టి అభిమానం చాటుకున్నారు. ఇటువంటిది రాజశేఖర్, ఆయన తనయుడు లక్ష్మీకాంత్ అయ్యన్నపాత్రుని కలవడం విశేషం. వీరిరువురిని అయ్యన్నపాత్రుడు ప్రత్యేకంగా వచ్చి ఆహ్వానించి ప్రత్యేకంగా గదిలోకి తీసుకెళ్లారు.

అయ్యన్నతో మాట్లాడుతున్న రాజశేఖర్

డిఎస్ఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రభుత్వ నిబంధనల మేరకు పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, లేకుంటే చర్యలు తప్పవని డిఎస్ఒ సూర్యప్రకాశరావు హెచ్చరించారు. గురువారం ఎంవిపి కాలనీలోని సుజిత ఏజెన్సీతోపాటు నగరంలోని పలు బంకులపై ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెట్రోల్ బంక్‌లో ఉచితంగా గాలి, మరుగుదొడ్డు, మంచినీరు సౌకర్యాలు కల్పించాలన్నారు. వినియోగదారులు కోరితే పెట్రోలు, డీజిల్ కొలతలు వేసి చూపించేందుకు వీలుగా కొలతపాత్రలను ఉంచాలన్నారు. కొనుగోలుదారులకు బిల్లు ఇవ్వాలని, స్టాక్ నిర్వహణ రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. నిబంధనల మేరకు అనేక బంకుల్లో సౌకర్యాలు లేనట్లు గుర్తించామన్నారు.

కంటి ఆపరేషన్లకు తరలింపు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని ధర్మవరం అగ్రహారంలో ఈనెల 17న ఉచిత వైద్య శిబిరంలో భాగంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో గుర్తించిన రోగులను ఆపరేషన్ నిమిత్తం గురువారం విజయనగరం పుష్పగిరి హాస్పిటల్‌కు తరలించారు. ఆపరేషన్ అనంతరం తిరిగి వీరిని ఏప్రిల్ 4న ధర్మవరం అగ్రహారం గ్రామానికి తీసుకొస్తారని అచ్యుత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అచ్యుత్ తెలిపారు.

తరలి వెళుతున్న రోగులు

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న లక్షలాది మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులతో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, పెద్దఎత్తున విశాఖ కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, కెఎం.కుమార్ మంగళం, పి.మణి, కార్యదర్శి బి.జగన్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదానీ, అంబానీ వంటి వారి సేవలో మోడీ ప్రభుత్వం మునిగి తేలుతోందని, కార్మికులను యజమానులకు బానిసలు చేసే విధంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేసి లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేస్తోందని, కార్మికుల నియామకాలు, తొలగింపులను యజమానుల ఇష్టారాజ్యం చేసిందని మండిపడ్డారు. సమ్మె, యూనియన్, కనీస వేతనం, పని గంటలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ తదితర కార్మిక హక్కులపై దాడి చేస్తోందని అన్నారు. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని నల్ల చట్టాలను తీసుకువచ్చిందన్నారు. రెండేళ్ల పాటు రైతులు ఢిల్లీలో మిలిటెంట్ పోరాటం చేయడంతో వాటిని రద్దు చేసిందని తెలిపారు. ప్రస్తుతం రైతుల భూములను కాజేసి కార్పొరేట్లకు ఇచ్చేందుకు కాచుకు కూర్చొందని విమర్శించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

తారల క్రికెట్ పోటీలకు సర్వం సిద్ధం

- నేడు, రేపు సిసిఎల్ క్రికెట్ టోర్నీ
- 24న సెమీఫైనల్స్, 25న ఫైనల్
- పిఎం.పాలెం స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సిసిఎల్) 2023 లీగ్ సెమీఫైనల్స్, ఫైనల్స్ పోటీలు ఈ నెల 24, 25 తేదీల్లో విశాఖలోని విసిఎ,ఎడిసిఎ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ నెల 24న మధ్యాహ్నం 2.30 గంటలకు ముంబై హీరోస్, భోజ్‌పురి దబ్బంగ్స్ మధ్య మొదటి సెమీఫైనల్, రాత్రి 7గంటలకు తెలుగు వారియర్స్ - కర్ణాటక బుల్డోజర్స్ మధ్య జరగనుంది. ఫైనల్ పోటీ ఈ నెల 25న జరగనుంది. ఈ సందర్భంగా సెలబ్రిటీ క్రికెట్ లీగ్ స్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ ఇందూరి మాట్లాడుతూ సిసిఎల్ -2023కు పోటీలకు సర్వం సిద్ధమైందన్నారు. ఈ టోర్నీకి వస్తున్న స్పందనపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో ప్రతి ఇన్నింగ్స్‌లో పది ఓవర్లు చొప్పున 20ఓవర్ల మ్యాచ్ సాగేలా కొత్త ఫార్మెట్‌ను రూపొందించామన్నారు. సినీ స్టార్లు అద్భుతమైన క్రికెట్ నైపుణ్యాలను ప్రదర్శించడం, మధ్యలో వినోదభరిత సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయన్నారు. సిసిఎల్ మ్యాచ్‌లను జీ నెట్‌వర్క్‌లోని ఆరు వేర్వేరు ఛానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు.

సంత వేలం పాట ఖరారు

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే సంత రూ. 2.63 లక్షలకు వేలం ఖరారు అయినట్టు ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, సంత వేలంకు పది మంది సభ్యులు హాజరయ్యారన్నారు.అనకాపల్లికి చెం దిన కన్నాజీ పాట దక్కించుకున్నాడని తెలిపారు. పాటదారుడు ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆశీళ్లు వసూలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, ఏవో మూర్తి పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీడీవో సీతారామరాజు ప్రారంభించారు. ముందుగా పౌష్టికాహారానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.గర్భిణీలు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత లోపించకుండా తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా సకాలంలో అందిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. వచ్చే నెల మూడో తేదీ వరకు అన్ని అంగన్వాడి కేంద్రాల్లోనూ పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల:చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన ఎండపల్లి గ్రామంలో అంగన్వాడీ సిబ్బందితో ఏర్పాటు చేసిన పోషక పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక సర్పంచి పావని ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పౌష్టికాహారాన్ని చిన్నారులకు పరిశుభ్రంగా అందజేయాలన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

క్షయపై విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి -మాకవరపాలెం:క్షయ వ్యాధిని నిర్మూలించాలని స్థానిక హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకూ విద్యార్థులు క్షయ వ్యాధిపై ర్యాలీ నిర్వ హించారు. క్షయ వ్యాధిపై నినాదాలు చేశారు. అనంతరం వైద్యాధికారి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ, క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. దీని పై గ్రామ స్థాయిలో ఎప్పటి కప్పుడు సిబ్బంది సర్వే చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

జాతీయ స్థాయి పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -పాయకరావుపేట:కృష్ణా జిల్లా గన్నవరం లో జనవరి 13, 14 న జరిగిన 37 వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర పోటీలలో శ్రీ ప్రకాష్‌లో 9 వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎమ్‌వివిఎస్ మూర్తి తెలిపారు. ఈ నెల 27 నుండి 31 వరకు అస్సాం రాష్ట్రం గౌహతిలో జరిగే 37వ జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సి.హెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు డి.వి. శ్రీనివాస్, కోచ్‌లు సురేష్, బాలరాజు, సహచర విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు అభినందించారు.

విద్యార్థులతో ఉపాధ్యాయులు

రోడ్డు నిధుల విడుదలకు వినతి

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం ఆరిలోవ రోడ్డుకు సంబంధించిన ఫైనాన్స్ క్లియరెన్స్ అమౌంట్ రూ.45.80లక్షలు విడుదల చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే స్థానిక విలేకరులకు తెలిపారు.

నగర మార్కెట్లోకి వెర్నా న్యూ వెర్షన్ కారు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉగాది సందర్భంగా హ్యుందాయ్ వెర్నా న్యూ వెర్షన్ కారును మార్కెట్లోకి విడుదల చేయటం హర్షనీయమని ఎపి ప్రభుత్వ సలహాదారు స్కిల్ ట్రైనింగ్ అండ్ జాబ్ ఫెయిర్ గాది శ్రీధర్ రెడ్డి అన్నారు. విశాఖ నగరంలోని లక్ష్మీ హ్యుందాయ్ షోరూమ్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఆరో తరం కొత్త వెర్షన్ వెర్నా కారును ఆయన మార్కెట్లోకి విడుదల చేశారు. ప్రయాణికులకు అనుగుణంగా ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన ఈ కారుకు మార్కెట్లో మంచి ఆదరణ రానుందన్నారు. లక్ష్మీ హ్యుందాయ్ సిఇఒ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని రకాల సదుపాయాలూ వెర్నా న్యూ వెర్షన్ సొంతమన్నారు. తక్కువ ధరకే లభిస్తుందని తెలిపారు. అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ కారును ఐదు రంగుల్లో, స్పోర్ట్స్ లుక్‌తో మార్కెట్లోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో కన్నమర్లు, ప్రేయో భిలాషులు, లక్ష్మీ హ్యుందాయ్ సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌రెడ్డి